ప్రజాశక్తి
శనివారం 12 ఏప్రిల్ 2025 5
శ్రీ సత్యసాయి



దార్శనికుడు జ్యోతిరావు పూలే

జయంతి వేడుకల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు



పూలేకు జయంతి కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

వందేళ్ల కిందటే బడుగుల హక్కులతో పాటు స్త్రీ సమానత్వానికి బాటలు వేసిన దార్శనికుడు మహాత్మా జ్యోతిబా పూలే అని ప్రజాప్రతినిధులు, అధికారులు పేర్కొన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే 199వ జయంతి వేడుకలను జిల్లా వ్యాప్తంగా శుక్రవారం నాడు ఘనంగా నిర్వహించారు. పూలే విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కలెక్టరేట్‌లోని అబ్దుల్ కలాం మైనార్టీ కమ్యూనిటీ భవనంలో వెనుకబడిన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పూలే జయంతి వేడుకల్లో కలెక్టర్ టిఎస్.చేతన్, ఇతర అధికారులు పాల్గొన్నారు. పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే సమస్యలను ఎదుర్కొని, వాటిని ప్రశ్నించారన్నారు. అణగారిన సామాజిక వర్గాల విద్యావ్యాప్తికి పాఠశాలలు ప్రారంభించిన మహోన్నత వ్యక్తి జ్యోతిరావు పూలే అన్నారు. స్త్రీలకు విద్య నేర్పించడం, వితంతు పునర్వివాహాలను ప్రోత్సహించడం వంటి ఎన్నో మంచి పనులకు శ్రీకారం చుట్టారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ శాఖ జిల్లా అధికారిణి నిర్మల జ్యోతి, బీసీ నాయకులు బోయ రామాంజనేయులు, మాజీ మున్సిపల్ ఛైర్మన్ బెస్త చలపతి, బీసీ ఐక్యవేదిక నాయకులు సామకోటి ఆదినారాయణ, కొట్టాల శ్రీరాములు, పల్లపు జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో తరగతులు.. విద్యార్థుల అవస్థలు

ఎండలు మండిపోతున్నాయి. 38 నుంచి 40 డిగ్రీల వరకు గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రానున్న రోజుల్లో భానుడు మరింత తీవ్ర రూపం దాల్చి ప్రతాపం చూపే అవకాశం కనిపిస్తోంది. ఎండలకు పలు జాగ్రత్తలు అవసరమని వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన చర్యలపై వైద్యులు సూచనలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏటా విద్యార్థులకు ఒంటిపూట బడులు, తర్వాత వేసవి సెలవులు ఇస్తారు. కూటమి ప్రభుత్వం ఈ ఏడాది నుంచి ఇంటర్ విద్యారంగంలో సంస్కరణలను తీసుకొచ్చింది. ఎవరితోనూ చర్చించకుండానే అకడమిక్ క్యాలెండర్ రూపొందించి మండు వేసవిలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఈ నెల 1 నుంచి తరగతులను ప్రారంభించారు. అధిక ఉష్ణోగ్రతలను తట్టుకోలేక పలువురు విద్యార్థులు కళాశాలలకు రావడం లేదు. మరోవైపు కొత్త సంస్కరణలపై అవగాహన కల్పించక పోవడంతో పూర్తిగా అనాసక్తి చూపుతున్నారు.



- ఎండవేడిమిలో ఇంటర్ క్లాసులు..!
- కళాశాలలకు హాజరుపై విద్యార్థుల అనాసక్తి
- ప్రభుత్వంపై విద్యార్థి సంఘాల మండిపాటు

ప్రజాశక్తి-హిందూపురం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్ 319 కళాశాలలు ఉన్నాయి. ఇందులో దాదాపు 1,27,600 మంది ఇంటర్ రెండో సంవత్సరం విద్యార్థులు చదువుతున్నారు. శ్రీ సత్యసాయి జిల్లాలో ప్రభుత్వ కెజిబివి, మోడల్ కళాశాలలు 70, ప్రయివేటు కళాశాలు 42 మొత్తం 112 జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఇందులో 13,083 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. వీరిలో ఇప్పుడు రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం ఈ నెల 1 నుంచి క్లాసులను ప్రారంభించింది. పాఠ్యపుస్తకాలను కూడా పంపిణీ చేస్తోంది.

అరకొర గానే హాజరు

మండుతున్న ఎండలకు ఇంటర్ తరగతులకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులు నామమాత్రంగానే హాజరవుతున్నారు. ప్రారంభం నుంచే విద్యార్థులు అరకొరగా మాత్రమే వస్తున్నారు. హిందూపురం పట్టణం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు 333 మంది ఉన్నారు. ఇందులో సగం మంది కూడా ప్రస్తుతం నిర్వహిస్తున్న తరగతులకు హాజరు కావాడం లేదు. ఇక ప్రయివేటు కళాశాలల్లో సైతం అరకొరగానే హాజరు నమోదు అవుతోంది. విద్యా రంగంలో సంస్కరణల పేరుతో కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న అనాలోచిత నిర్ణయాలు తీసుకుంటోందని విద్యార్థి సంఘం నాయకులు చెబుతున్నారు. పరీక్షలు రాసి వేసవి సెలవుల మూడ్ లోకి వెళ్లిన విద్యార్థులను కాలేజీలకు రండి అని చెబుతుండడంపై విద్యార్థులు కూడా అసహనం వ్యక్తం చేస్తున్నారు. ముందస్తు ఎలాంటి కసరత్తు, క్షేత్రస్థాయి ప్రణాళిక లేకుండా ఏప్రిల్ 1 నుంచి తరగతులు ప్రారంభం, 7వ తేదీ నుంచి ఇంటర్ మొదటి సంవత్సరం అడ్మిషన్లు అంటూ అయోమయానికి గురి చేయడంపై విద్యార్థులు, తల్లిదండ్రులు అసంతృప్తి చెందుతున్నారు.

కార్పొరేట్‌కు సర్కారు వత్తాసు

రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ కళాశాలకు అనుకూలంగా ఈ నెల 1 నుంచి ఇంటర్మీడియట్ తరగతులను ప్రారంభించారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కోసం కాక కార్పొరేట్ కాలేజీలకు అనుకూలంగా ప్రతి సంవత్సరం సమ్మర్ క్లాసులు పేరు చెప్పి నిర్వహించుకునేదానికి ప్రభుత్వమే ముందుండి జీవోలు ఇవ్వడంపై తల్లిదండ్రుల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. పదో తరగతి విద్యార్థులకు ఏప్రిల్ ఒకటో తేదీన పరీక్షలు పూర్తవగా ఇంకా ఫలితాలు రాకుండానే 7 నుంచి అడ్మిషన్ ప్రక్రియ చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం చెప్పడం విడ్డూరంగా ఉందని విద్యార్థి సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రయివేటు, కార్పొరేట్ కళాశాలల్లో అడ్మిషన్లు చేసుకోవడానికి ప్రభుత్వమే ఇలాంటి కొత్త పద్ధతికి శ్రీకారం చుట్టిందని విద్యార్థులు చెబుతున్నారు.

కార్పొరేట్ ఏజెంట్‌లా రాష్ట్ర ప్రభుత్వం

రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం కార్పొరేట్ విద్యాసంస్థలకు ఏజెంట్‌గా వ్యవహరిస్తోంది. అందుకోసమే ఎవరినీ సంప్రదించకుండగా ఇంటర్ విద్యా వ్యవస్థలో మార్పులను తీసుకొచ్చింది. నారాయణ విద్యా సంస్థల్లో పనిచేసే వారిని ఇంటర్ బోర్డు సలహాదారులకుగా తీసుకున్నారు. కేవలం కార్పొరేట్ విద్యాసంస్థలు ముందస్తు తరగతులు నిర్వహించుకోవడానికి, ముందస్తు అడ్మిషన్ లు చేసుకోవడానికే ఇంటర్ విద్యాలో మార్పులను తీసుకొచ్చారు.

ఈరేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

కలెక్టర్ టిఎస్.చేతన్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

రెవెన్యూ సేవలో భాగంగా ప్రజల అవసరాలు తీర్చడంలో అంకితభావంతో పనిచేసే సమస్యల పరిష్కారమే ధ్యేయంగా అధికారులు పనిచేయాలని కలెక్టర్ టిఎస్.చేతన్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లో రెవెన్యూ సేవలపై డివిజన్ స్థాయి అధికారులు తహశీల్దార్లు సర్వే అధికారులకు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డిపిఒ విజయ సారథి, డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ రెడ్డి, పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే సమస్యలు, రీ సర్వే ఆర్ఒఆర్ కేసుల నమోదు, వాటి పరిష్కారం, మ్యూటేషన్ ఆడిట్ అసైన్మెంట్ భూముల సమస్యలు సర్వేయర్లు శిక్షణ తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ భూ సమస్యలు నిర్దిష్ట కాల పరిమితిలో పరిష్కరించి ప్రజల్లో సంతృప్తి కలిగే విధంగా పనిచేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్, లోకాయుక్త, ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన వినతులను ప్రత్యేక శ్రద్ధతో పరిష్కరించడానికి కషి చేయాలన్నారు. రీ సర్వే ప్రక్రియలో పురోగతి సాధించాలని ఆదేశించారు. పి-4 సర్వే కి సంబంధించి పనులు ఎప్పటికప్పుడు నివేదికలు అందించాలన్నారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 15 నుంచి రీ సర్వే రెండవ విడత ప్రారంభించాలన్నారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి, ధర్మవరం, కదిరి, పెనుకొండ ఆర్డీవోలు సువర్ణ, మహేష్, శర్మ, ఆనంద్ సర్వే ల్యాండ్ ఎడి విజయశాంతి భాయి, జిల్లాలోని 32 మండలాల తహశీల్దార్లు, సర్వేయర్లు పాల్గొన్నారు.

గ్యాస్ ధర తగ్గింపుపై 13న సంతకాల సేకరణ

ప్రజాశక్తి-గోరంట్ల

పెంచిన వంట గ్యాస్ ధర తగ్గించాలని డిమాండ్ చేస్తూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 13వ తేదీ సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టనున్నట్లు వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న తెలిపారు. గోరంట్లలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధర పెంచి పేద మధ్యతరగతి ప్రజలపై అధిక భారం మోపిందన్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజలపై ఆర్థిక భారం పడుతుందన్నారు. ఈ పరిస్థితుల్లో గ్యాస్ ధర తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 13వ తేదీ పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్‌లో చేపట్టనున్న 'సంతకాల సేకరణ' కార్యక్రమంలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో వ్యకాసం జిల్లా కమిటీ సభ్యురాలు స్వర్ణలత, భవన నిర్మాణ కార్మిక సంఘం నియోజకవర్గ కన్వీనర్ కొండా వెంకటేశులు, ఆంజనేయులు, హబీబ్, తదితరులు పాల్గొన్నారు.



క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా షాపును సందర్శించిన ఒకేషనల్ విద్యార్థులు

క్షేత్రస్థాయి పర్యటనతో నైపుణ్యాభివృద్ధి

ప్రజాశక్తి-అగళి

క్షేత్రస్థాయి పర్యటనలతో విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందుతాయని, తద్వారా వారికి పరిశ్రమల్లో ఉద్యోగావకాశాలు దక్కుతాయని ఎపి మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ మహమ్మద్ జాఫర్ తెలిపారు. ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌లో భాగంగా స్థానిక ఎపి మోడల్ స్కూల్‌కు చెందిన ఒకేషనల్ విద్యార్థులు శుక్రవారం ఒకేషనల్ ట్రైనర్స్ ఆర్.నాగరత్నమ్మ, చంద్రబాబునాయుడు పర్యవేక్షణలో క్షేత్రస్థాయిలో పర్యటించారు. వారు బ్యూటీ పార్లర్, లేడీస్ కార్నర్‌లను సందర్శించి ప్రత్యక్ష అవగాహన పొందారు. నైపుణ్యం పొందిన వారి నుంచి మెలకువలు తెలుసుకున్నారు. అలాగే ఐటి ట్రేడ్ గురించి పలు షాపులను సందర్శించారు. మీసేవ, ఇంటర్నెట్ సెంటర్, ప్రింటింగ్ ప్రెస్, మొబైల్, హార్డ్ వేర్, తదితర షాపులను సందర్శించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థుల వెంట ఒకేషనల్ జిల్లా కోఆర్డినేటర్ కృష్ణచైతన్య, పదో తరగతి, ప్రథమ, ద్వితీయ ఇంటర్ విద్యార్థులు పాల్గొన్నారు.

వికలాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ

ప్రజాశక్తి-అగళి

స్థానిక భవిత కేంద్రంలో శుక్రవారం విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వం సరఫరా చేసిన మూడు చక్రాల సైకిళ్లు, చెవిటి మిషన్లను అందజేవారు. వాటిని ఎంఇఒ నారాయణరావు, జడ్పీ హై స్కూల్ హెచ్ఎం శేఖర్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులు, వారి తలిదండ్రులు, ఎంఆర్‌సి సిబ్బంది గౌడ్, లావణ్య, మల్లేష్, భవిత టీచర్లు తిప్పేస్వామి, చైతన్య పాల్గొన్నారు.



విభిన్న ప్రతిభావంతులకు ట్రై సైకిల్ పంపిణీ చేస్తున్న ఎంఇఒ, హెచ్ఎం

ఆర్టీసీ డిపోలో సమస్యలపై ఎన్ఎంయుఎ ధర్నా

ప్రజాశక్తి-మడకశిర

పట్టణంలోని ఆర్టీసీ డిపోలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రెండో రోజైన శుక్రవారం ఎపిపిడి నేషనల్ మజ్దూర్ యూనిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జోనల్ ట్రెజరర్ హెచ్ఎస్.రాయుడు అధ్యక్షతన డిపో ఆవరణలో మహా ధర్నా చేపట్టారు. అసోసియేషన్ నాయ కులు మాట్లాడుతూ 2019 సర్క్యులర్ అమలు చేయాలని, అక్రమ సస్పెన్షన్లు, తొలగింపులను ఆపాలని, ఉద్యోగోన్నతులు కల్పించాలని, గ్యారేజ్ ఉద్యోగుల అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని, సిక్ లీవులకు పూర్తి వేతనం, నైట్ అవుట్ అలవెన్సులు రూ. 150 నుంచి రూ. 400 వరకూ చెల్లించాలని, ఈహెచ్ఎస్ స్థానంలో పాత వైద్య విధానం పునరుద్ధరించాలని, తదితర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్ఎంయుఎ రీజినల్ లీడర్ కరియప్ప, డిపో సెక్రటరీ రామకృష్ణ, అధ్యక్షుడు ముద్దప్ప, అసిస్టెంట్ సెక్రటరీ జయసింహ, ఉద్యోగులు అజీజ్, ఫకృద్దీన్, మల్లికార్జున, చెన్నరాయప్ప, ఎంవిఎస్.రమేష్, గ్యారేజ్ సెక్రటరీ రాము, బాబు, రసూల్, తదితరులు పాల్గొన్నారు.



డిపో గేట్ వద్ద మహాధర్నా నిర్వహిస్తున్న ఆర్టీసీ కార్మికులు

అర్హులకు న్యాయం చేయండి

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ప్లంబర్స్ అండ్ ఎలక్ట్రిషియన్స్ కార్మికుల ఇళ్ల పట్టాల విషయంలో అర్హులకు న్యాయం చేయాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆపార్టీ నాయకులు శుక్రవారం స్థానిక కాలేజీ సర్కిల్ నుండి మున్సిపాలిటీ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించి మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ నియోజక వర్గ కార్యదర్శి ముసుగు మధు, చేతి వృత్తిదారుల రాష్ట్ర కార్యదర్శి, సిపిఐ పట్టణ కార్యదర్శి పూల శెట్టి రవి కుమార్, సహాయ కార్యదర్శి ఎర్రంశెట్టి రమణ తదితరులు మాట్లాడుతూ సర్వేనెంబర్ 650 -2 లో ప్లంబర్స్ అండ్ ఎలక్ట్రానిక్ కార్మికులకు రెండు ఎకరాలు భూమిని ప్రభుత్వం కేటాయించిందన్నారు. అయితే భూమి విలువ పెరగడంతో కొంతమంది అక్రమదారులు ఆభూమిని ఆక్రమించడానికి దొంగ పట్టాలు సృష్టించి కార్మికులకు అన్యాయం చేస్తున్నారన్నారు. ఈ పట్టాలను తహశీల్దార్ పరిశీలించి నకిలీ పట్టాలుగా గుర్తించారన్నారు. ఇప్పటికైనా మున్సిపాలిటీ అధికారులు ఫేక్ పట్టాలతో భూ ఆక్రమణ చేసి నిర్మిస్తున్న వాటిని తొలగించి కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు లలితమ్మ,లింగమ్మ, ఈరమ్మ, ప్లంబర్స్ అండ్ ఎలక్ట్రానిక్ నాయకులు భాష,అన్వర్,ఆంజనేయులు,ప్రకాష్, చిన్న, సిపిఐ నాయకులు శ్రీధర్,శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

'సంఘం శరణం గచ్ఛామి' పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-రొళ్ల

మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా శుక్రవారం మడకశిరలో ఎంఇఎఫ్ ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో డాక్టర్ బిఆర్. అంబేద్కర్ నాటిక, సంఘం శరణం గచ్ఛామి పోస్టర్లను విడుదల చేశారు. నాయకులు మాట్లాడుతూ కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కెవిపిఎస్) ఆధ్వర్యంలో మే 1వ తేదీ చేపట్టనున్న సంఘం శరణం గచ్ఛామి అభ్యదయ ఆర్ట్స్ అకాడమీ, హైదరా బాద్ వారు ప్రదర్శిస్తున్న నాటికను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్యక్రమంలో ఎంఇఎఫ్ జిల్లా నాయకులు డాక్టర్ శివన్న, డాక్టర్ రంగస్వామి, రామకృష్ణ, రంగనాథ్, ఉగ్ర నరసింహ, శ్రీరాములు, రిటైర్డ్ తహశీల్దార్ రంగప్ప, కాటికాపరుల సంఘం రాష్ట్ర నాయ కులు బి.యోగానంద్, రామాంజనేయులు, చౌడప్ప, ఎ.కృష్ణ పాల్గొన్నారు.

పంటల సాగుపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచి కుంటాల పుల్లయ్య

ప్రజాశక్తి - తాడిమర్రి

మండల పరిధిలోని రామాపురం గ్రామపంచాయతీకి సర్పంచి కుంటాల పుల్లయ్య తిరుపతిలో శుక్రవారం జరిగిన క్రాఫ్ట్ సైన్స్ లిమిటెడ్ కంపెనీ బడ్జెట్ సమావేశంలో పాల్గొన్నారు. నడం జరిగింది ఈ కార్యక్రమంలో కుంటల పుల్లయ్య మాట్లాడుతూ తాడిమర్రి మండలంలో రైతులకు పంటల సాగులో ప్రోత్సాహం, అవగాహన కల్పించే విధంగా ధన క్రాఫ్ట్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. రైతులను వివిధ కంపెనీలు చేస్తున్న మోసాలపై అవగాహన కల్పించాలన్నారు.

అంబేద్కర్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-గోరంట్ల

మండలంలోని కమ్మవారిపల్లి పంచాయతీలో ఏర్పాటు చేసిన డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహాన్ని శుక్రవారం ముఖ్యఅతిథి బూడిదిగడ్డపల్లి గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ శేషాద్రిరెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు వీరనారాయణరెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఎమ్మార్పీఎస్ నాయకులు నారాయణ, తిప్పయ్య, ఓబుల్ కుమార్, రమేష్‌బాబు, లక్ష్మీపతి, రమణ, నరసింహప్ప పాల్గొన్నారు.



అంబేద్కర్ విహావిష్కరణలో పాల్గొన్న నాయకులు



పౌష్టికాహారంపై గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న సిడిపిఒ జి.శాంతలక్ష్మి

గర్భిణులకు అవగాహన


ప్రజాశక్తి-రొద్దం

మండలంలోని పి.రొప్పాల అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం పోషణ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. సిడిపిఒ జి.శాంతలక్ష్మి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, రెండేళ్ల లోపు పిల్లల తల్లిదండ్రులకు వెయ్యి రోజుల సంరక్షణ అనగా గర్భం దాల్చినప్పటి నుంచి బిడ్డ పుట్టి రెండేళ్ల వరకూ ఉన్న దశ చాలా ముఖ్యమైందన్నారు. ఈ దశలో సమతుల పౌష్టికాహారం, ఆరోగ్య పరీక్షలు, వ్యాధి నిరోధక టీకాలు, తగిన విశ్రాంతి, నిద్ర అవసమన్నారు. మొబైల్‌లో 'పోషణ ట్రాకర్' యాప్ డౌన్‌లోడ్ చేసుకుని ఐసిడిఎస్ లబ్ధిదారుల ఫారంను పూర్తి చేసే విధానాన్ని వివరించారు. ప్రతి నెలా పిల్లల బరువులు, ఎత్తులు తీయించి పోషణ ట్రాకర్ యాప్ ద్వారా పౌష్టికాహార లోపం వున్న పిల్లలను గుర్తించి, డాక్టర్ చేత పరీక్షలు చేయించి పోషకాహార పునరావాస కేంద్రానికి పంపించాలన్నారు. ఊభకాయాన్ని కూడా గుర్తించి డాక్టర్ చేత పిల్లలకు ఆకలి పరీక్షలు చేయించాలన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఎం.సుజాత, మహిళా శిశు సంరక్షణ కార్యదర్శి నాగరత్నమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు సాయిలీల, స్వప్న, సునీత, విమల, గంగమ్మ, జయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సాగు పట్టాలివ్వాలి

ప్రజాశక్తి-పావగడ

రెవెన్యూ అధికారులు తక్షణమే రైతులకు సాగు పట్టాలు మంజూరు చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పూజారప్ప డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం తాలూకాలోని వెంకటాపుర గ్రామ శివారులో నిరసన కార్యక్రమంలో చేపట్టారు. పూజారప్ప మాట్లాడుతూ వెంకటాపుర గ్రామంలోని సర్వే నంబర్-494లో 27 ఎకరాల ప్రభుత్వ భూమిని సుమారు 30 ఏళ్లుగా ఏడుగురు రైతులు సాగు చేసుకుంటున్నారన్నారు. రైతులు 20 ఏళ్ల క్రితమే సాగు పట్టాల కోసం దరఖాస్తు చేసుకున్నా రెవెన్యూ అధికారులు సాగుపట్టాలు ఇవ్వకుండా కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెవెన్యూ అధికారులు డబ్బులు ఇస్తేనే పనులు త్వరగా చేస్తారని లేకుంటే రైతులను కార్యాలయాల చుట్టూ తిప్పుతున్నారని ఆరోపించారు. రైతు సంఘం సభ్యుడు ఈశ్వర్ మాట్లాడుతూ ఏళ్ల తరబడి పంటలు సాగు చేస్తున్న భూమిని ఇప్పుడు గ్రామపంచాయతీ అధికారులు స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించడం తగదన్నారు. ఒకవేళ అలా చేయాల్సి వేస్త ఆ ఏడుగురు రైతులకు మరోచోట వ్యవసాయ భూమి చూపించాలన్నారు. కార్యక్రమంలో తాలూకా రైతు సంఘం అధ్యక్షుడు శివ్, నాయకులు ఈశ్వర్, నాగేంద్రప్ప, మల్లికార్జున, హనుమంతరాయప్ప, భారతమ్మ, సునీతాలక్ష్మి, అక్కులప్ప, ఈరన్న, తిప్పేనాయక్, గోపాల్, సత్యప్ప, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



రైతులకు సాగు పట్టాలివ్వాలని నిరసన వ్యక్తం చేస్తున్న రైతు సంఘం నాయకులు

సమస్యల వలయంలో చెరువు మునెప్పగారి పల్లె

ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు

మండల పరిధిలోని కొండకమర్ల పంచాయతీ పరిధిలోని చెరువు మునెప్ప గారి పల్లెను అధికారులు గుర్తించాలని ఆ గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామంలో సమస్యలు రాజ్యమేలుతున్నాయని, ఆ సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శిస్తున్నారు. చెరువు మునెప్పగారి పల్లి అనేది మండలంలో ఒక గ్రామం ఉందని అధికారులు గుర్తించాలని అంటున్నారు. గ్రామంలో 75 గృహాలున్నాయన్నారు. ఎక్కడ చూసినా వీధుల్లో చెత్తాచెదారం పేరుకుపోయిందని మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తోందని వాపోయారు. మురుగునీరు రోడ్డు పక్కన ఉన్న బోరు బావిలోకి వెళ్లడంతో ఈ నీరు కలుషితమయ్యాయని వాపోయారు. ఈ నీరు తాగి పెద్దలు పిల్లలు అనారోగ్యం పాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమది మారుమూల గ్రామం కావటంతో అధికారులు ఎవ్వరూ పట్టించుకోవటం లేదని విమర్శిస్తున్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను పంచాయతీ అధికారులకు, సర్పంచికి విన్నవించినా వారు పట్టించుకోవటం లేదని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ గ్రామాన్ని గుర్తించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు మధుసూదన్ రెడ్డి, తిరుపాల్, మనోహర్, గంగాధర్ కోరుతున్నారు.



తాగునీటి బోరు చుట్టూ నెలకొన్న అపరిశుభ్రత

ఉద్యోగోన్నతి అధికారికి సన్మానం

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం రూరల్ మండలంలోని కునుతూరు రైతు సేవ కేంద్రంలో పట్టు పరిశ్రమ శాఖ సహాయకులుగా పనిచేస్తున్న కరుణాకర్ యాదవ్‌కు పట్టు పరిశ్రమ శాఖ సాంకేతిక సహాయకులుగా ఉద్యోగోన్నతి లభించడంతో ఆయనను తోటి ఉద్యోగులు సన్మానించారు. శుక్రవారం ధర్మవరం మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో సహాయ వ్యవసాయ సంచాలకులు కృష్ణయ్య, మండల వ్యవసాయ అధికారి ముస్తఫా, చెన్న వీరస్వామి, హార్టికల్చర్ అధికారిని అమరేశ్వరి, వ్యవసాయ విస్తరణ అధికారులు, మండలంలో పనిచేయుచున్న వివిధ రైతు సేవా కేంద్రాల సిబ్బంది, ఎంపీఈవోలు కరుణాకర్ యాదవ్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సంచాలకుల సిబ్బంది రంగస్వామి, రాఘవేంద్ర ,ఇమ్రాన్, ఎఇఒలు మురళి, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

వైసిపి మండల కన్వీనర్‌గా శ్యాంసుందర్ రెడ్డి

ప్రజాశక్తి - కొత్తచెరువు రూరల్

వైసిపి మండల కన్వీనర్‌గా శ్యాంసుందర్‌రెడ్డిని ఎన్నుకున్నారు. ఈ మేరకు శుక్రవారం మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీదర్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక వైసిపి కార్యాలయంలో పలువురు వైసిపి నాయకులు ఆయనను అభినందించారు. ఈ సందర్భంగా శ్యాంసుందర్ రెడ్డి మాట్లాడుతూ తన ఎంపికకను కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డికి, వైసిపి రాష్ట్ర కార్యదర్శి తలమర్ల సంజీవరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

ఇన్‌ఛార్జి కార్యదర్శిగా నాగరాజు

ప్రజాశక్తి - కొత్తచెరువు

కొత్తచెరువు మేజర్ గ్రామపంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శిగా బండ్లపల్లి కార్యదర్శి నాగరాజును నియమించినట్లు ఎంపీడీవో నటరాజ్ తెలిపారు. ఈ మేరకు నాగరాజు శుక్రవారం మేజర్ పంచాయతీ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి సెలవుపై వెళ్లడంతో తలమర్ల కార్యదర్శి రాంగోపాల్ రెడ్డిని గత నెలలో ఇన్‌ఛార్జిగా నియమించారు. అయితే మేజర్ గ్రామపంచాయతీ మార్కెట్ వేలంలో గందరగోళం నెలకొనడంతో పాటు పంచాయతీలో సమస్యలు అధికమవడంతో ఆయన విధుల నుండి తప్పుకున్నారు. దీనితో ఉన్నతాధికారులు నాగరాజును ఇన్‌ఛార్జి కార్యదర్శిగా నియమించారు.

వికలాంగులకు ఉపకరణాలు పంపిణీ

ప్రజాశక్తి - ఓబులదేవర చెరువు

స్థానిక భవిత సెంటర్‌లో శుక్రవారం నిర్వహించిన కారక్రమంలో ఎంఇఒ సురేష్‌బాబు చేతుల మీదుగా వికలాంగులకు ఉపకరణాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో విభిన్న ప్రతిభావంతులకు టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్, వీల్ చైర్లు , లెటర్స్ సిపి, వీల్ చైర్లు 28 వచ్చాయని వీటినిసక్రమంగా ఉపయోగించు కోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం నిర్మల, దళితవాడ ప్రాథమిక పాఠశాల టీచర్ శ్రీనివాస్, సహితఉపాధ్యాయులు నరసింగబాబు, నాగ శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమం ప్రారంభం

ప్రజాశక్తి తాడిమర్రి

మండల కేంద్రంలో తల్లి దీవెన పేరుతో సోమ సుందరి ఉమెన్స్ పవర్ సొసైటీ ఆధ్వర్యంలో వృద్ధాశ్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. వృద్ధులకు, మతిస్థిమితం లేని వారికి, నిరుపేదలకు, యాచకులకు, అనాధలకు ఈ వృద్ధాశ్రమంలో సేవలు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల నాయకులు వెంకటేష్, చిన్న పెద్దన్న తాడిమర్రి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యత పై అవగాహన

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండల పరిధిలోని కొడికొండ చెక్ పోస్ట్ లోని సమర్థనం వికలాంగుల సంస్థలో రిజర్వ్ బ్యాంక్, కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో వికలాంగ విద్యార్థులకు శుక్రవారం ఆర్థిక అక్షరాస్యత పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా సిఎఫ్ఎల్ కోఆర్డినేటర్ శివ శంకర్ రెడ్డి మాట్లాడుతూ సైబర్ నేరాలకు గురైనప్పుడు వెంటనే 1930 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా పలు బీమా పాలసీ వివరాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ హరికృష్ణ, ట్రైనర్స్ నరసింహ మూర్తి, కవిత విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - బుక్కపట్నం

క్షయ, టీబి వ్యాధులపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని హెల్త్ ఎడ్యుకేటర్ రామన్న తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని పాముదుర్తి గ్రామంలో క్షయ, టీబి వ్యాధులపై అవగాహన కల్పించారు, రెండు వారాలకు మించి దగ్గు, బరువు తగ్గడం, రాత్రిపూట జ్వరం రావడం వంటి లక్షణాలు ఉన్నట్లయితే వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని, క్షయ టీబీ వ్యాధులు ఉన్నట్లు నిర్ధారణ అయితే వారికి దగ్గరలో ఉన్న వారు కూడా వైద్య పరీక్ష చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ హబీబ్ భాష, వైద్య సిబ్బంది కీర్తి, సరిత, కమలాకర్, హరిత తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణ పరిధిలోని ముద్దిరెడ్డిపల్లి అయ్యప్ప స్వామి దేవాలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్, ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శులు సురేంద్ర, వీరయ్య, శ్రీనివాసరావు, బాలాజీ ఈ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పల్లా లక్ష్మీ కుమార్, ఆలయ కమిటీ అధ్యక్షులు పురిడి మంజునాథ్, ఆలయ గురుస్వామి సుబ్బరాయుడు, టిడిపి నాయకులు డిజె. ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యల పరిష్కారానికి అలుపెరగని పోరాటం

రైతుసంఘం ఆవిర్భావదినోత్సవ వేడుకల్లో నాయకులు



జెండా ఆవిష్కరణలో పాల్గొన్న నాయకులు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

రైతు సమస్యల పరిష్కారం కోసం రైతుసంఘం ఆధ్వర్యంలో అలుపెరగని పోరాటాలు చేస్తున్నామని ఆసంఘం నాయకులు పేర్కొన్నారు. అఖిల భారత రైతు సంఘం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆసంఘం నాయకులు శుక్రవారం ధర్మవరం తహశీల్దార్ కార్యాలయం ముందు జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న, జిల్లా ఉపాధ్యక్షులు ఏ మారుతి మాట్లాడుతూ రైతు సంఘం ఆవిర్భావం, పోరాటాలు, విజయాల గురించి వివరించారు. రైతు వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని ఎండగడుతూ రైతులకు అండగా నిలబడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ చేనేత కార్మిక సంఘం నాయకులు ఎస్‌హెచ్. బాషా, వెంకటస్వామి, హరి, సిఐటియు నాయకులు జెవి రమణ, టి అయూబ్‌ఖాన్, ఎల్ ఆదినారాయణ, ఎస్. హైదర్‌వలి, రైతులు శంకర ,ఆది, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : ఆల్ ఇండియా కిసాన్ సభ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కదిరి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో బాలింతలకు ఏపీ రైతు సంఘం నాయకుల ఆధ్వర్యంలో బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం నాయకులు సుధాకర్ రెడ్డి, ఉదయ్ కుమార్, రఫీ, ఆంజనేయులు, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారానికి రైతుసంఘం చేస్తున్న పోరాటాలను వివరించారు.

టిడ్కోగృహాలను పూర్తి చేయండి : సిపిఎం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఇఎస్. వెంకటేష్

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్


మున్సిపాలిటీ పరిధిలో అర్ధాంతంగా ఆగిపోయిన టిడ్కో గృహ నిర్మాణాలను వెంటనే పూర్తిచేసి వాటిని లబ్ధిదారులకు అందజేయాలని సిపిఎం నాయకులు కోరారు. పుట్టపర్తి మండల పరిధిలోని కర్ణాటక నాగే పల్లి సమీపంలో 864 ఇండ్లను పూర్తి చేసి పట్టణంలో నివసించే లబ్దిదారులకు అప్పగించాలని వారు కోరారు. ఈ మేరకు శుక్రవారం సిపిఎం జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈ ఎస్ వెంకటేష్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం పేరుతో గత నెల 25న కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగిన ధర్నాలో ఈ జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలన్నిటిని రాతపూర్వకంగా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. అయితే ఇప్పటివరకు వాటిలో ఒక్క సమస్య కూడా పరిష్కరించలేదన్నారు. దీన్ని బట్టి చూస్తే అధికారులకు ప్రజాసమస్యల పరిష్కారంలో ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థం అవుతోందని విమర్శించారు. జిల్లాలో ఇల్లు లేని నిరుపేదలకు కేటాయించిన టిడ్కోగృహ నిర్మాణాలను అర్ధాంతరంగా నిలిపివేయడం బాధాకరమన్నారు. పుట్టపర్తితో పాటు హిందూపురం, కదిరి ,ధర్మవరం పట్టణాల్లో కూడా వేలాది టిడ్కో గృహ నిర్మాణాలు అర్ధాంతరంగా ఆగాయన్నారు. వీటిని బ్యాంకు రుణం ద్వారా నిర్మిస్తుండటంతో తీసుకున్న రుణం చెల్లించాలని లబ్ధిదారుల ఖాతాల్లో ఉన్న కొద్దిపాటి సొమ్మును బ్యాంకు అధికారులు జమ చేసుకోవడంతో పాటు లబ్ధిదారులకు నోటీసులు పంపించి రుణాలు వెంటనే చెల్లించాలని చెప్పడం ఎంతవరకు సమంజసమన్నారు. టిడ్కో రుణాలను వెంటనే రద్దు చేయాలని అసంపూర్తిగా నిలిచిపోయిన గృహ నిర్మాణాలను ప్రభుత్వ నిధులు ద్వారా పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో ఈనెల 15న ఆందోళన భాగంగా లబ్ధిదారులతో వెళ్లి జెండాలు పాతి డిడ్కో గృహాలను స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి బ్యాళ్ల అంజి, నాయకులు ముత్యాలు, ఆఫీస్ కార్యదర్శి సిద్దు, భాష తదితరులు పాల్గొన్నారు.

నారాయణ విద్యాసంస్థలకు నిబంధనలు వర్తించవా..?

ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఈరేష్, నాగార్జున



పాఠశాల ముందు ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు



డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

కూటమి ప్రభుత్వంలో మంత్రి గా ఉన్నా నారాయణకు సంబంధించిన నారాయణ విద్యా సంస్థలకు ప్రభుత్వ నిబంధనలు వర్తించవా అని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షకార్యదర్శులు ఈరేష్, నాగర్జున విద్యాశాఖ అధికారులను ప్రశ్నించారు. నారాయణ పాఠశాలలో ముందస్తు అడ్మిషన్లు చేసుకోవడంతో పాటు నిబంధనలు అతిక్రమించి పాఠశాలలో పుస్తకాలను విక్రయిస్తున్నారు. విషయం తెలుసుకున్న ఎస్ఎఫ్ఐ నాయకులు శుక్రవారం పాఠశాల ముందు ఆందోళన చేశారు. విద్యాశాఖ అధికారులు వెంటనే ఇక్కడికి వచ్చి పాఠశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని ఎంఇఒ గంగప్పకు తెలిపినా ఆయన అక్కడికి రాలేదు. దీంతో నాయకులు స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేసి, డిప్యూటి తహశీల్దార్ మైనూద్దీన్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఈరేష్ మాట్లాడుతు నారాయణ పాఠశాలలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు ప్రచారాలు, అడ్మిషన్లు నిర్వహిస్తున్నా చర్యలు తీసుకోవడం లేదన్నారు. అంతే కాకుండా యూకేజీ నుండి పదవ తరగతి వరకు రూ.30 వేల నుంచి 50వేల రూపాయల వరకు విద్యార్థుల దగ్గర ఫీజులు వసూలు చేస్తున్నారని విమర్శించారు. విద్యార్థులకు కనీస క్రీడ మైదానం మౌలిక సదుపాయాలు కూడా సరిగా కల్పించడం లేదన్నారు. ఫీజులతో పాటు ఇక్కడే పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, బుక్స్ టైలు కొనాలని నిబంధన పెట్టి రూ. 10 నుంచి 25 వేల వరకు అదనంగా వసూలు చేస్తున్నారన్నారు. విద్యాలయాలను వ్యాపార కేంద్రాలుగా మార్చిన నారాయణ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సురేష్, భరత్ చంద్ర, మహేష్, హరి, రవి తదితరులు పాల్గొన్నారు.

గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో అక్కాచెల్లెలు



గిన్నిస్‌రికార్డ్స్‌లో చోటు సంపాదించుకున్న కావ్య, ప్రణతి

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

పట్టణంలోని రాజేంద్రనగర్ లో గల ఉపాధ్యాయుడు సోమిశెట్టి రమేష్ బాబు, భార్య శ్యామల కుమార్తెలు సోమిశెట్టి కావ్య, సోమిశెట్టి ప్రణతి లక్ష్మి నృత్య కళాకారులుగా గుర్తింపు పొందుతూ గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు సంపాదించుకున్నారు. వీరిరువురు ఎంతో శిక్షణ పొంది యువ నృత్య కళాకారులుగా మంచి గుర్తింపు సంపాదించారు. ఇటీవల భారత సాంస్కృతిక శాఖ కేంద్ర సంగీత నాటక అకాడమీ సంయుక్తంగా భారత దేశపు విభిన్న రాష్ట్రాలలోని 53 జానపద కళారూపాల విభిన్న నృత్యాల ప్రదర్శన నిర్వహించారు. ఈ నృత్య ప్రదర్శనలో 5,194 మంది కళాకారుల సమూహారంగా నృత్య ప్రదర్శన చేశారు. దీంతో ఈ ప్రదర్శన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డును సాధించింది. ఇందులో ప్రముఖ జానపద కళాకారిని సోమిశెట్టి సరళ గ్రూప్ లీడర్ ఆధ్వర్యంలో సోమిశెట్టి కావ్య, సోమిశెట్టి ప్రణతి లక్ష్మి ఈ ప్రదర్శనలో భారతదేశం తరఫున పాల్గొన్నారు. వీరి ముగ్గురు పేర్లను కూడా అత్యున్నత సాయి గిన్నిస్ వరల్డ్ రికార్డులో నమోదు అయ్యాయి. ఈ మేరకు గిన్నిస్ బుక్ సర్టిఫికెట్స్ తమ ఇంటికి అందాయని వారు తెలిపారు. ఒకే కుటుంబంలోని నృత్యకళాకారులు గిన్నిస్ రికార్డు ఎక్కడం తమకు ఎంతో సంతోషాన్ని కలిగించిందని తండ్రి సోమిశెట్టి రమేష్ బాబు, తల్లి శ్యామల ఆనందాన్ని వ్యక్తం చేశారు.

నీటి సమస్యను పరిష్కరించండి

ప్రజాశక్తి - కదిరి టౌన్



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పట్టణంలోని 33వ వార్డు మూర్తిపల్లిలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆపార్టీ నాయకులు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మున్సిపల్ డిఇ విజయ్‌కుమార్‌కు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మూర్తిపల్లి, ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో వారం నుంచి తాగునీటి సమస్య నెలకొందన్నారు. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ఆర్యవైశ్య శ్మశాన వాటిక నుండి మూర్తిపల్లి వరకు వీధిలైట్లు లేక రాత్రిపూట ఆ దారిగుండా వెళ్ళాలంటే ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారన్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి వీధి లైట్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ నాయకులు రామ్మోహన్, జగన్మోహన్, ముస్తాక్ అలీ, ఆంజనేయులు, రఫిక్, సుధాకర్ రెడ్డి, ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఎస్పీ, తదితరులు

శక్తి యాప్‌తో మహిళలకు భద్రత : ఎస్పీ

ప్రజాశక్తి - ముదిగుబ్బ

శక్తి యాప్ మహిళలకు, బాలికలకు భద్రత కల్పిస్తుందని ఎస్పీ రత్న పేర్కొన్నారు. మండలంలోని మంగళమడక గ్రామంలో గురువారం రాత్రి నేర నియంత్రణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్పీ మాట్లాడుతూ శక్తి యాప్ ప్రతి మహిళ ఫోన్లో ఉంచుకోవాలన్నారు. యాప్ వల్ల కలిగే ఉపయోగాల గురించి వివరించారు. అదేవిధంగా సైబర్ నేరాలపట్ల అప్రమత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం డీఎస్పీ మహేష్, సీఐ శ్యామ్ రావు ఎస్ఐ రాజశేఖర్, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రమణ్యస్వామి రథోత్సవం

ప్రజాశక్తి-హిందూపురం

70 సంవత్సరాల క్రితం పట్టణంలో స్థిరపడ్డ తమిళ భక్తులు శుక్రవారం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి రథోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. తమిళ ఆచారం ప్రకారం టంగుణి నక్షత్రంలో వచ్చే పౌర్ణమి నాడు ఆడ, మగ అన్న తారతమ్యం లేకుండా కోరిన కోరికలు తీర్చాలని, తమ మొక్కుబడులు తీర్చుకోవడం ఆనవాయితీ. పట్టణంలో ఇందిరా నగర్, ఫలని నగర్ ప్రాంతాలలో స్థిరపడిన తమిళ భక్తులు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, రథోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ఇదే సందర్భంగా హోలీ వేడుకలు సైతం జరుపుతున్నారు. భక్తులు ఇనుప చువ్వలను తమ దవడ గుండా గుచ్చుకొవడం, వీపులకు కొక్కిలను ఏర్పాటు చేసుకొని రథాన్ని లాగడం, వాహనానికి ప్రత్యేకంగా ఇనుప దూలాలను ఏర్పాటు చేసుకోవటం తదితర ఎన్నో ఒళ్లు గగుర్పాటు కల్పించే విన్యాసాలతో దేవాలయం నుండి పట్టణ వీధుల గుండా రథోత్సవం నిర్వహించారు. రథోత్సవాన్ని పురస్కరించుకుని మున్సిపల్ చైర్మేన్ రమేష్ కుమార్, టిడిపి నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే విధంగా వైసిపి నాయకులు వేణురెడ్డితో పాటు నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరితో పాటు జనసేన నాయకులు ఆకుల ఉమేష్ తో నాయకులు పాల్గోని పూజలు నిర్వహించారు. ఇదే సందర్భంగా జనసేన మండల అధ్యక్షులు చక్రవర్తి ఆలయ అభివృద్ధి కోసం రూ.10వేలు విరాళం అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో కాలేజీ విద్యార్థి మృతి

ప్రజాశక్తి-పావగడ

ముగ్గురు విద్యార్థులు బైక్‌పై వెళ్తుండగా అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరు ఆసుపత్రి పాలైన సంఘటన గురువారం రాత్రి తుమకూరు పట్టణంలోని క్యాతసంద్ర సమీపంలో జరిగింది. వివరాలు.. తాలూకాలోని బెళ్లిబెట్టలు గ్రామానికి చెందిన గ్రామ పంచాయతీ సభ్యుడు మచ్చయ్య, అక్కమ్మ దంపతుల కుమారుడు మిథున్(20) తుమకూరు యూని వర్శిటీలో బి.కాం. ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఇదే గ్రామానికి చెందిన కళ్యాణ్, దీక్షిత్ తుమకూరులో డిప్లొమా చదువుతున్నారు. ఈ ముగ్గురూ గురువారం రాత్రి బైక్‌పై వెళ్తుండగా క్యాతసంద్ర సమీపంలో రోడ్డు డివైడర్‌ను ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో మిథున్ అక్కడికక్కడే మృతిచెందగా, కళ్యాణ్, దీక్షిత్ తీవ్రంగా గాయపడ్డారు. అటుగా వెళ్తున్న పెట్రోలింగ్ పోలీసులు వారిని గమనించి కళ్యాణ్, దీక్షిత్‌లను తుమకూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బైక్ అదుపు తప్పి ఒకరు..

పావగడ : బైక్ అదుపు తప్పి కింద పడడంతో తాలూకాలోని గ్యాదిగుంట గ్రామానికి చెందిన బాబు(39) శుక్రవారం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. వివరాలు.. బాబు తన మామ గ్రామమైన రామగిరి మండలంలోని కొండాపురం గ్రామానికి ద్విచక్ర వాహనంపై బయల్దేరాడు. మార్గమధ్యలో తిమ్మాపురం గ్రామ సమీపంలో బైక్ అదుపు తప్పి కింద పడ్డాడు. తలకు తీవ్ర గాయం కావడంతో రాత్రంతా అలాగే ఉండి ఉదయం బంధువులకు ఫోన్ ద్వారా తెలిపాడు. బంధువులు పావగడ ప్రభుత్వాసుపత్రికి తరలిస్తున్న సమయంలో మార్గమధ్యలో మృతి చెందాడు. బాబుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఆకతాయిల విధ్వంసం

కోడూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో వస్తువులు ధ్వంసం

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండల పరిధిలోని కోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం రాత్రి ఆకతాయిలు విధ్వంసం సృష్టించారు. పాఠశాలలో నీటి పైపులను, కొళాయిలను విరగొట్టారు. పాఠశాలలో ఉన్న చెత్తాచెదరానికి నిప్పంటించారు. ఆకతాయిలు మద్యం తాగి పాఠశాల ఆవరణంలోని మందు సీసాలను వదిలేసి వెళ్లారు. ఈ చర్యలపై హెచ్‌ఎం రంగనాథ్, ఎంఇఒ సాల్మన్ రాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

జీనియస్ పాఠశాలపై చర్యలు తీసుకుంటాం

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

పట్టణంలోని జీనియస్ బెస్ట్ ఫౌండేషన్ పాఠశాలపై వచ్చిన ఫిర్యాదుల మేరకు చర్యలు చేపడతామని ఎంఇఒలు రాజేశ్వరి దేవి, గోపాల్ నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ పాఠశాలలో రెండవ తరగతి చదువుతున్న చిన్నారిపై అనిత అనే టీచర్ చెప్పుతో కొట్టడంపై తమకు ఫిర్యాదు అందిందని, తల్లిదండ్రులు విద్యార్థి సంఘాలు కూడా పాఠశాల వద్ద ధర్నాలు నిర్వహించాయని చెప్పారు. పాఠశాలకు వెళ్లి జరిగిన విషయాన్ని తెలుసుకొని నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు పంపడం జరిగిందని తెలిపారు. జిల్లా ఉన్నతాధికారుల నుంచిఉత్తర్వులు వచ్చిన వెంటనే ఆ పాఠశాలపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

అక్రమ కేసులు ఎత్తేయాలి

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

మీడియా ప్రతినిధులపై అక్రమంగా కేసులు బనాయిస్తున్నారని, వాటిని ఎత్తివేసి మీడియా స్వేచ్ఛను కాపాడాలని ఏపీయుడబ్ల్యూజె నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పుల్లయ్య మాట్లాడుతూ ఈనెల మూడున పల్నాడు జిల్లాలో హరిచంద్ర హత్యకు గురైనడని ఈ సంఘటన సాక్షి దినపత్రికలో ప్రచురితం కాగా సాక్షి ఎడిటర్ ధనుంజయ రెడ్డి తో పాటు ఆరు మంది జర్నలిస్టులపై కేసులు పెట్టడం అన్యాయమని అన్నారు. మీడియాలో ఎక్కడైనా పొరపాటు జరిగితే ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు ఫిర్యాదు చేసి సరిదిద్దాలే తప్ప కేసులు పెట్టి ఇబ్బందులు పెట్టడం సరైనది కాదని అన్నారు. ప్రభుత్వానికి సమాజానికి వారదులుగా ఉన్న జర్నలిస్టులపై కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేయడం పద్ధతి కాదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు ఏపీయుడబ్ల్యూజే బాబు రాజేష్, మదన్ మోహన్ రెడ్డి, సాయి కృష్ణారెడ్డి, గంగిరెడ్డి, విజయ్ శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్యం అక్రమ విక్రయాలపై ఉక్కుపాదం

ప్రజాశక్తి,- ధర్మవరం రూరల్

నవోదయం 2.0కార్యక్రమంలో భాగంగా మద్యం అక్రమ అమ్మకాలపై ఉక్కుపాదం మోపుతున్నామని ఎక్సైజ్ సిఐ చంద్రమణి తెలిపారు. శుక్రవారం ధర్మవరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ధర్మవరం మండలం ఓబులనాయన పల్లి తాండ గ్రామంలో నాటు సారా తయారు చేస్తున్న ఆర్.చాంప్లానాయక్, రవినాయక్‌ను అరెస్టు చేసి 8 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అధికారులు హరికృష్ణ, సునంద, చాంద్‌బాషా, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

పట్టణంలోని శ్రీదేవి థియేటర్ వెనుక భాగాన గల గుడిబండ వెంకటేష్ శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుని కుటుంబం పేద కుటుంబం కావడంతో తారక్ చేయుత ట్రస్ట్ వారికి స్థానికులు సమాచారాన్ని అందించారు. సమాచారం అందుకున్న తారక్ ట్రస్ట్ అధ్యక్షులు రామాంజనేయులు టిడిపి నాయకుడు సందా రాఘవకు సమాచారాన్ని అందజేశారు. స్పందించిన ఆయన మృతుని కుటుంబానికి ఆర్థికసాయం ప్రకటించాడు. దీంతో తారక్ చేయుత ట్రస్ట్ వారు ఆ కుటుంబం వద్దకు వెళ్లి 8 వేల రూపాయల సహాయాన్ని మృతుని దహన సంస్కారాలకు గాను అందజేశారు. మతునికి భార్య లక్ష్మీదేవితో పాటు, ఒక కుమార్తె ఉన్నారు. మృతుడు పాలిష్ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడని, అనుకోకుండా అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని రోడ్డున పడిందని స్థానికులు వాపోయారు. ఈ కార్యక్రమంలో తారక్ చేయుత ట్రస్ట్ తుకారాం ,ముత్యాలు, తదితరులు పాల్గొన్నారు.

16న పంచాయతీ మార్కెట్ వేలం

ప్రజాశక్తి - కొత్తచెరువు

కొత్తచెరువు మేజర్ గ్రామపంచాయతీ మార్కెట్ వేలం పాటను ఈనెల 16న నిర్వహిస్తున్నట్లు ఇన్‌ఛార్జి కార్యదర్శి నాగరాజు తెలిపారు. సర్పంచి రాధ అధ్యక్షతన వారపు సంత, దినసరి సంత, బస్టాండ్, సులభ కాంప్లెక్స్ నిర్వహణకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు చెప్పారు.. అలాగే ఈ నెల 19వ తేదీ 49 షాపింగ్ గదులకు వేలంపాల నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. ఆసక్తిగల వారు ధరావతు చెల్లించి వేలం పాటల్లో పాల్గొనాలని కోరారు.

ప్రాథమిక పాఠశాలలు మూతపడకుండా చూడాలి

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

ఉన్నత పాఠశాలలు ఉన్న గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలలు మూతపడకుండా చర్యలు తీసుకోవాలని వైఎస్ఆర్ టిఎ జిల్లా శాఖ నాయకుల డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ శాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి పివి రమణారెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు రోజు ఒక ప్రకటన చేస్తూ ఉపాధ్యాయులను, తల్లిదండ్రులను అయోమయానికి గురి చేస్తున్నారని విమర్శించారు. ఇన్ని రోజులు 117 జీవో రద్దు చేస్తామని చెప్పి ఇప్పుడు అంతకంటే కఠినమైన నిర్ణయాలు ప్రభుత్వం తీసుకొంటోందన్నారు..

సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు

ప్రజాశక్తి పుట్టపర్తి క్రైమ్

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు దశలవారీగా ఉధృతం చేస్తామని ఎన్ఎంయు నాయకులు హెచ్చరించారు. శుక్రవారం డిపో ముందు గేట్ ధర్నా నిర్వహించి నినాదాలు ఇచ్చారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అక్రమ సస్పెన్షన్లు తొలగించాలని, గత నాలుగేళ్లుగా నిలిపివేసిన ఉద్యోగోన్నతులను కల్పించాలని, అన్ని కేటగిరీల్లో ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంయు జిల్లా అధ్యక్షులు శ్రీరామ్ నాయక్, జిల్లా కార్యదర్శి షబ్బీర్, డిపో అధ్యక్షులు శివశంకర్, రీజనల్ ఉపాధ్యక్షులు రవితేజ, ప్రశాంతి, రాజేశ్వరి, కళావతి తదితరులు పాల్గొన్నారు.



పూలే చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎస్పీ రత్న



పూలే విగ్రహం వద్ద కదిరి ఎమ్మెల్యే, కందికుంట, తదితరులు



హిందూపురంలోపూలే విగ్రహానికి నివాళి

సామాజిక సంస్కర్త జ్యోతిరావు పూలే

జిల్లా వ్యాప్తంగా జ్యోతి రావు పూలే జయంతి వేడుకలు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

దళిత బహుజన వర్గాల స్ఫూర్తి ప్రదాత సామాజిక చైతన్యం కోసం ఎన్నో త్యాగాలు చేసిన మహోన్నత వ్యక్తి జ్యోతిబా పూలే అని జిల్లా ఎస్పీ వి.రత్న కొనియాడారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం జ్యోతిబా పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ జ్యోతిబాపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. విద్యా వికాసంతోనే వివక్ష నిర్మూలన సాధ్యమవుతుందని నమ్మిన గొప్ప స్వాప్నికుడని అన్నారు. దేశానికి ఆయన అందించిన సేవలను గుర్తించి ప్రభుత్వం మహాత్మా పూలే జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన ఆశయాలు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీతో పాటు, ఏవో ,సుజాత, సూపరింటెండెంట్ సరస్వతి, అర్ఐ వలి, సిఐ లు శ్రీనివాసులు, సతీష్, తిమ్మారెడ్డి, ఎస్‌బి ఎస్ఐ ప్రదీప్ కుమార్, ఆర్ఎస్ఐలు వీరన్న, ప్రదీప్ సింగ్, వెంకటేశ్వర్లు, ఎఎస్ఐ శ్రీరాములు, డిపిఒ, ఏఆర్, సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్: జ్యోతిరావుపూలే బలహీనవర్గాల మార్గదర్శి అని వక్తలు అన్నారు. పూల 198వ జయంతి సందర్భంగా శుక్రవారం ధర్మవరం నియోజకవర్గం బీసీ ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో స్థానిక కాలేజ్ సర్కిల్ నందు గల జ్యోతిబాపూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సిరికల్చర్ ఈశ్వరప్ప బీసీ ఉద్యోగ సంఘం నాయకులు ముత్యాలప్ప, జెన్నే నాగప్ప,వాల్మీకి ఉద్యోగ సంఘం ప్రధాన కార్యదర్శి రాంప్రసాద్, బీసీ ఉద్యోగ సంఘం నాయకులు ఏపీఎస్ఆర్టీసీ లక్ష్మన్న మధుసూదన్ నాగేంద్ర భాస్కర్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా టిడిపి ఆధ్వర్యంలో పూలే జయంతిని నిర్వహించారు.కాలేజి సర్కిల్లో గల మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ కర్యాక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు పరిసే సుధాకర్, బిసి నాయకులు కమతం కాటమయ్య, పోతుకుంట లక్ష్మన్న,పురుషోత్తం గౌడ్, దళిత నేత కేశగాళ్ల శీనా, రామయ్య తదితరులు పాల్గొన్నారు.అదే విధంగా ప్రభుత్వ కార్యాలయాల్లో పూలే జయంతిని నిర్వహజంచారు.

తలుపుల : స్థానిక మూడు రోడ్ల కూడలిలో శుక్రవారం మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు ఈ కార్యక్రమంలో ఎద్దుల రాముడు, బాబు, బాదుల్లా, రాజశేఖర్, వేమన్న, సురేంద్ర, పార్థ తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : జ్యోతి రావు పూలే జయంతి సందర్భంగా ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పట్టణంలోని జ్యోతి రావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సామాజిక రుగ్మతలపై పోరాడిన తొలి తరం సామాజిక విప్లవయోధుడు, బాలికలు, మహిళల విద్యా వికాసం కోసం, వితంతువుల హక్కుల కోసం కృషి సల్పిన గొప్ప సంఘ సంస్కర్త పూలే అని కొనియాడారు, ఈ కార్యక్రంలో నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా కదిరి జనసేనపార్టీ ఇన్చార్జి భైరవ ప్రసాద్ ఆధ్వర్యంలో జ్యోతి రావు పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు దశరథ నాయక్, గంగాధర్ నాయకులు రవికుమార్,అంజిబాబు, చక్కా రమణ , గుంత ప్రతాప్,గంగరాజు, రాజా రమణ, నందిసెట్టి బాబూ, రాజా, అంజి తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం సిఎస్‌డిటి మునిస్వామి ఆధ్వర్యంలో జ్యోతిరావు ఫూలే జయంతి వేడుకలను నిర్వహించారు. ఫూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు :మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి మల్లికార్జున ఆధ్వర్యంలో శుక్రవారం మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకుడు ఆదినారాయణప్ప, గ్రంథాలయ పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హిందూపురం : ఆదర్శనీయుడు జ్యోతిరావ్‌పూలే అని మున్సిపల్ చైర్మేన్ రమేష్ కుమార్ తో పాటు పలువురు నాయకులు పేర్కొన్నారు. పూలే జయంతిని పురస్కరించుకుని వివిధ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల వారు శుక్రవారం పట్టణంలోని సూగూరూ అంజినేయ ఆలయ సమీపం వద్ద ఉన్నా మహాత్మ జ్యోతిరావ్ పూలే విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సతీష్ కుమార్, అంజలి, రాష్ట్ర వాల్మీకి డైరెక్టర్ బెవన హల్లి ఆనంద్, రాష్ట్ర కురుబ కార్పోరేషన్ డైరెక్టర్ పరిమళ, లీగల్ సెల్ అధ్యక్షుడు శివ శంకర్, టీడీపీ నాయకులు అమర్ నాథ్, నెట్టప్ప, వెంకటేష్, ప్రెస్ వెంకటేష్, దుర్గా నవీన్, డైమండ్ బాబా, సుమో శీనా, మురళీ దేశాయ్, అంజాద్, రవీంద్ర, బుస ప్రసాద్, రవి, అంజి, కిరికెర మాజీ సర్పంచి రాము, కూటమి నాయకులు ఆదర్శ్, పార్థ సారథి, టిడిపి తెలుగు మహిళా నాయకురాలు వెంకటలక్ష్మి, చెన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ : బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మ జ్యోతిబాపూలే అని సీనియర్ టిడిపి నాయకులు వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో శుక్రవారం మహాత్మ జ్యోతిబాపూలే 198వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన సమాజానికి సేసిన సేవలు కొనియాడారు. కార్యక్రమంలో మాధవ నాయుడు, చంద్రమౌళి, కన్వీనర్లు శ్రీరాములు, సిద్దయ్య, రాంపురం సర్పంచి శ్రీనివాసులు, అశ్వర్థ నారాయణ, కౌన్సిలర్ హనుమంతు, రామలింగ, నంజుండ, బాబుల్‌రెడ్డి, త్రివేంద్ర, పులుగూర శ్రీనివా సులు, ప్రసాద్, ప్రభంజన్, బాబిరెడ్డి, ప్రసాద్, చంద్రకాంతమ్మ, నారాయణనాయక్, చిన్నరాయుడు, సోము, సుబ్రహ్మణ్యం, గోపాల్ పాల్గొన్నారు.

బహుజన చైతన్య వేదిక ఆధ్వర్యంలో..

బహుజన చైతన్య వేదిక ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ కూడలి వద్ద పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది శివరామకృష్ణ, బాబుప్రసాద్, రవికుమార్, నరసింహులు, కొల్లప్ప, తిరుపతయ్య, ఆంద్రూస్, శేషాద్రి, లక్ష్మణ్‌నాయక్ పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో..

పట్టణంలోని మహాత్మ జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో దళిత సంఘాల ఆధ్వర్యంలో పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ ఆనంద్, ఉపాధ్యాయులు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ 18వ శతాబ్దంలోనే సమ సమానత్వం కోసం పోరాడిన మహనీయులు పూలే అన్నారు. కుల వివక్షను రూపుమాపడానికి కృషి చేశారన్నారు. కార్యక్రమంలో టి.రామాంజనేయులు, ఎంఎన్.మూర్తి, ఎం.పెద్దన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

మడకశిర : అణగారిన వర్గాల ప్రజల అభ్యున్నతికి పాటుపడిన ఏకైక వ్యక్తి మహాత్మ జ్యోతిరావు పూలే అని మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, కుంచితి ఒక్కలిగ బిసి సాధికారిక కన్వీనర్ వీఎం.పాండురంగప్ప తెలిపారు. మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా శుక్రవారం వారు పట్టణంలోని అమరాపురం బస్టాండ్‌లో ఉన్న పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు భూతన్న, టిడిపి మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ బద్రి, భక్తర్‌సాబ్, రాజా, ఉమాశంకర్, హనుమంతు, శ్రీనివాసులు, శీనప్ప, నాగేంద్ర, ఈశ్వర్, రమేష్ , బలరాం, వెంకటలక్ష్మమ్మ, నాగరాజు, రంగేగౌడ్, పుల్లయ్య, తిమ్మరాజు, రఘురామ్, కృష్ణమూర్తి, కట్టా కిషోర్, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఎపి స్కూల్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

ఎపి స్కూల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు డి.మారుతి ప్రసాద్ ఆధ్వర్యంలో పట్టణం లోని నగర పంచాయతీ పరిధిలో మహాత్మజ్యోతిరావుపూలేను స్మరించుకున్నారు. వారు మాట్లాడుతూ పూలే అంటరానితనం నిర్మూలన, బాలికా విద్యను ప్రోత్సహించేందుకు విశేషకృషి చేశారని కొనియాడారు. ప్రస్తుత సమాజానికి పూలే లాంటి సంఘ సంస్కర్తల అవసరం చాలా ఉందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు రమేష్, ప్రధాన కార్యదర్శి సురేష్, సహాధ్యక్షులు అశ్వర్థనారాయణ, ఉపాధ్యక్షులు నాగరాజాచారి, మంజునాథ్, విష్ణు, కోశాధికారి నరసింహ మూర్తి, ఉపాధ్యాయులు ఉమేష్, కాంతరాజు, మద్దిలేటి, కల్పన, తదితరులు పాల్గొన్నారు.

రొద్దం : మండలంలోని ఆర్.మరువపల్లిలో ఉన్న మహాత్మ జ్యోతిబా పూలే పాఠశాలలో పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఉపాధ్యాయ బృందం పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు పూలే సేవల గురించి వివరించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయ బృందం, సిబ్బంది, విద్యార్థులు పూల చిత్రపటం, జాతీయ జెండా చేతబూని గ్రామంలో ర్యాలీ చేపట్టారు.



పెనుకొండలో పూలే చిత్రపటానికి నాయకుల నివాళి



మడకశిరలో పూలే విగ్రహం వద్ద నాయకుల నివాళి



రొద్దంలో పూలే చిత్రపటంతో విద్యార్థుల ర్యాలీ